# గొల్ల రామవ్వ

**-పి.వి.నరసింహారావు**

(28 జూన్ 1921 - డిసెంబరు 23-2004)

**రా**జనీతిజ్ఞుడు, బహుభాషావేత్త, రచయిత, భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహా రావు మంచి కథకులు కూడా. కాకతీయ పత్రిక ఆయన ప్రారంభించి, నిజాం పాలనపై తిరుగుబాటుకు దానిని ఒక అస్త్రంగా వాడుకున్నారు. ఆయన ఆ రోజులలో ఆగస్టు 5, 1949 కాకతీయ పత్రికలో యీ కథను "విజయ" పేరుతో రాశారు. శైలినిబట్టి, కథా వస్తువుని బట్టి పివి రచనగా కనిపెట్టారు. పివికి ముగ్గురు కుమారులు. అయిదుగురు కుమార్తెలు. కూతురులలో ఒకరి పేరు విజయ. పివిని సంస్మరించుకుంటూ యీ కథను మా పాఠకులకు అందిస్తున్నాం.

**'ధాం'**... ధాం... ధాం!... బాంబుల ప్రేలుడుతో అర్ధరాత్రి ప్రశాంత వాతావరణం ఛిన్నాభిన్నమైంది. సర్వత్రా నిండుకున్న నిస్తబ్ధతను ఆ ధ్వని తరంగాలు చీల్చి ఒక విచిత్ర సంచలనం కలుగచేసి శూన్యంలో విలీనమైనవి. గాఢ నిద్రలో నిమగ్నమై యున్న గ్రామమంతా ఒక్కపెట్టున దద్దరిల్లిపోయింది. ఆబాలగోపాలం గొల్లు మన్నారు... నిద్రమబ్బులో ఏమి జరిగిందో ఎవరికీ బోధ పడలేదు... ఏదో వేదన. ఏదో చికాకు. ఏదో బెగుడు. కాని అంతా అగమ్యగోచరమే. ఊరి వారికందరికి ఒకే సమయాన ఏదో మహా భయంకరమైన పీడకల వచ్చి హఠాత్తుగా నిద్రనుండి త్రుళ్లిపడి లేచారా అన్నంత అలజడి చెలరేగిందా రెండు నిమిషాల్లో....

ఇంత అలజడి చెలరేగినా బజార్లు మాత్రం నిర్మానుష్యంగానే ఉన్నవి. లోపలి నుండి వేసుకున్న తలుపుల గొళ్లాలు తీసి బయటికి తొంగి చూతామనుకున్న వారి చేతులు కూడా గొళ్లాల మీదికి పోగానే ఎక్కడిదక్కడ జలదరించి నిలిచి పోయినవి. చికాకువల్ల కీచుకీచుమని అరుస్తూ తత్తరపాటుతో అటూ ఇటూ లేచిపోయే పక్షుల రవం, వాటి రెక్కల తటపట, ఊరిచుట్టు పై రండ్లలో నుండి కుక్కల అరపు, దొడ్లలో నిశ్చింతగా నెమరువేస్తున్న పశువుల గిజగిజ, అక్కడక్కడ దొడ్ల కంపను విరుగద్రొక్కి ఊళ్లో తోచినదిక్కల్లా పరుగెత్తే దున్నపోతుల గిట్టల రాపిడి - ఇవి మాత్రమే ఆ తదుపరి వినిపించినవి. అంతేకాని ఒక్కసారి గొల్లుమన్న గ్రామస్తులు మాత్రం అదేదో దివ్యజ్ఞానబోధ కలిగిందా అన్నట్లు మళ్లీ కిమ్మనలేదు... కిమ్మనలేదు నిజమే కాని బొద్దుడిన

## ఆణిముత్యాలు

కూన పర్యంతం ఎవ్వరూ నిద్ర కూడా పోలేదు... ఏవో గుసగుసలు... ఏవో సైగలు.. ఏవో అసహాయ దృక్కులు. ఏవో వినపడని మ్రొక్కులు.... తల్లులు పిల్లలకు శ్రీరామరక్ష తీశారు. పిల్లల దడుపు పోవడానికి ఎడమ అరికాలు దుమ్ముతో నొసట బొట్టు పెట్టారు. వీపు చరిచారు కాని పిల్లల దడుపు కుపాయాలు యోచించే తల్లులకు తమ దడుపుకే ఉపాయం దొరుకలేదు. బొట్టు పెట్టుతున్న చేతుల గాజులు గలగలమంటూనే ఉన్నవి. ఉన్న చోటనే ఉన్న కాళ్ల పాజేబులు కూడా కించిత్తు ఝుంకరిస్తునే ఉన్నవి....

అదొక విచిత్ర ప్రళయం....

అదొక క్షణిక మృత్యుతాండవం...
అదొక అస్థిరోత్పాతం...

00000000

ఒకగంట గడిచింది.... ఎప్పటి వలెనే నలువైపుల అంధకారం అలముకొన్నది. చిమ్మట్లు ఏకశ్రుతితో అరుస్తున్నవి. అంతా మామూలే. కాని నిద్ర మాత్రం ఊరి దరిజేరలేదు.

గొల్ల రామమ్మ తన గుడిశెలో చీకటిలోనే కూర్చొని ఉంది. ఆమె కాళ్లు చేతులు కూడ వణుకుతున్నవి. కొంత వృద్ధాప్యం వల్ల; కొంత భయం వల్ల, ఆమె ఒడిలో ఒక పదిహేనేండ్ల బాలిక తలదాచుకొని ఉంది....

'అవ్వా! అప్పుడిదేం చప్పుడే?" అని మెల్లగా ప్రశ్నించిందా బాలిక.

"నీకెందుకే మొద్దుముండా? గిదేంది, గదేంది – ఎప్పుడికి అడుగుడే! ఏదో మునిగిపోయినట్టు! – అన్నీ నీకే కావాలె!"

బాలిక మళ్లీ మాట్లాడ సాహసించలేదు. కాని కొన్ని నిమిషాలకు ముసలవ్వ తనంత తానే మెల్లగా గొణగడం మొదలు పెట్టింది, "ఏమనుకున్నవే మల్లీ! మాపాడు కాలమొచ్చిందే!.... మీరెట్ల బతుకుతరో ఏమో బిడ్డ! ఈ తురుకోల్లతోటి చావొచ్చింది... మొన్ననే నలుగుర్ని తుపాకినేసి చంపిండ్రు. ఇప్పుడు కూడా ఏదో గఘోంటి అగాయిత్తమే చేసిన్రేమో!..... ఏం పోగాలమో వీల్లకు!...."

మళ్లీ నిశ్శబ్దం.... రామమ్మ మల్లమ్మ ఇద్దరు తమ తమ యోచనల్లో పడి పోయారు. నిద్రకు మాత్రం సంపూర్ణ బహిష్కారమే... డెబ్బైయేండ్లు దాటిన రామమ్మకు జాగరణే, క్రొత్తగా వయసు వచ్చిన మల్లమ్మకు జాగరణే....

హఠాత్తున కిటికీ నెవరో తట్టారు... కిటికీ అంటే దాని ప్రాణమెంత? – మంటిగోడలో వెల్తురుకొరకని ఉంచబడ్డ ఒక రంధ్రం. దానికి చెదలు పట్టిన ఏదో చెక్కతో చేయబడ్డ రెండు చిన్న తలుపులు. ఇదే ఆ గుడిసెకు కిటికీ....

ఆ చప్పుడుకు లోపలి వారిద్దరు ఉలికిపడ్డారు. కూర్చున్న చోటి నుండి కదలక శ్వాసోచ్ఛ్వాసాలు బిగబట్టి జాగ్రత్తగా వినసాగారు. కిటికీ తలుపులు గాలికి కొట్టుకున్నవో లేక పిల్లి వచ్చి కదిల్చిందో అని...!....

మళ్లీ అదే చప్పుడు. ఈ సారి అనుమానం లేదు. ఎవరో కిటికీ తలుపులు తట్టుతున్న మాట నిజం. గాలి కాదు పిల్లి అసలే కాదు.

ఏం చేయాలి? ఎటూ తోచలేదు...

మళ్లీ చప్పుడు ఈసారి పెద్దగా వినపడింది. ఏదో స్థిర సంకల్పంతోనే తట్టినట్లు....

ఇక లాభం లేదు. ముసలవ్వ మెల్లిగా లేవసాగింది. మల్లమ్మ గుండె దడదడ మాత్రం మితిమీరింది. అవ్వను గట్టిగా పట్టుకొని కంపించే గుసగుసలో "నాకు బయమైతాందే అవ్వా!" అనగలిగింది.

"అట్లుండు! ఏందో చూత్తాం" అని ముసలవ్వ దృఢ నిశ్చయంతో లేచింది. అలవాటు చొప్పున చీకటిలోనే కిటికీ వద్దకి చేరుకుంది. లోపల గొళ్లెం తీస్తూ "ఎవ్వర్రా?" అంది.

ఆ ప్రశ్న పూర్తిగా ఉచ్చరించబడిందో లేదో ముసలవ్వ నోరు గట్టిగా మూయ బడింది. వెంటనే ఒక వ్యక్తి అతి కష్టం మీద ఆ ఇరుకు కిటికీ గుండా లోపలికి చొరబడ్డాడు. అతని పాదాలు లోపలి నేలకు ఆనినవో లేదో అతడే కిటికీ

## చూడలేని దృశ్యాలు

కట్టూ బొట్టూ జుట్టూ పీక్కుని
ఫ్యాషన్ పెరేడ్లై స్త్రీ సమానత సాకుగా
విచ్చలవిడిగా తిరిగే అతివలారా!
అందాలను ఆరబోసుకోకండి
మోజుల చూపుల్లోంచి శీలాన్ని
పారబోసుకోకండి
మీరారబోసే మీ మేని అందాలు
భరతమాత శీలసంపద సుమ్మీ!
అది మీ సొగసు సంపద కాదు
కోమలాంగులారా! కోపగించుకోకండి
మీ సోదరుడ నేను
నా కళ్లు ఈ దృశ్యాల్ని
చూడలేకపోతున్నాయ్!
నా ప్రగతిశీల దృక్పథాన్ని మన్నించండి!!

–బోజంకి వెంకటరవి

తలుపులు బిగించాడు. ముసలవ్వ బీరిపోయి నిలుచుంది. ఇంకో మూలన మల్లమ్మ గట్టిగా కండ్లు మూసుకొని కత్తిపోటుకై ఎదిరి చూస్తున్నట్టు పడి ఉంది. చిమ్మన చీకట్లో ఏదీ కనబడడం లేదు. ముసలవ్వకు మాత్రం సందేహం లేదు... గతానుభవమే అంతా సూచించింది. పోలీసో, రజాకారు తురకవాడో ఇంట్లో దూరాడు... ఇంకేముంది? తనకు చావు తప్పదు. తానల్లారు ముద్దుగా పెంచి పెండ్లి చేసిన తన మనవరాలికి మానభంగం తప్పదు... ఎవరెదిస్తారీ రాక్షసుల్ని? తాను గోల పెట్టితే మాత్రం పక్క ఇంటివారైనా వినిపించుకుంటారా? ఊహు! కలలోని మాట!... వాళ్లవి మాత్రం ప్రాణాలు కావా? వాళ్ల యింట్లో మాత్రం పడుచు పిల్లలులేరా?.... ఆనాడు అంత పెద్దకరణంగారి కూతుర్ని బలాత్కారం చేసి ఎత్తుక పోయినప్పు డెవరేం చేయగలిగారు? ఎవరడ్డం వచ్చారు? ఇప్పుడు తనకు మాత్రం దిక్కెవ్వరౌతారు?....

ఒక్క నిమిషంలోపల ముసలమ్మ ఇదంతా యోచించింది. ఇక జరుగబోయేది ఆమెకు స్పష్టంగా, అద్దంలోలాగ కనిపించసాగింది.

తాను చచ్చినా సరే, తల్లిదండ్రులు లేని మల్లికైనా మానభంగం తప్పితే... తానా పిల్లను సాది సంబాళించింది తుదకీ రాక్షసునికి ఒప్పగించడానికేనా?... ముసలవ్వ కన్నీరు నింపుతూ కొయ్యవలె నిలిచిపోయింది. వృద్ధాప్యపు కంపనం. కూడా ఎందుకో తనంతతానే స్తంభించి పోయింది.

ముసలవ్వకు, ఆ వ్యక్తికి మధ్య దాదాపు రెండు గజాల దూరముంది... యోచనామధ్యంలోనే ఆ వ్యక్తి ఆమె వైపు రెండడుగులు వేశాడు. చీకటిలో కూడా సూటిగా సమీపిస్తున్నాడు.

ఆమెకు మిన్ను మిరిగి మీద పడ్డట్టయింది. ఇంకొక్క అడుగులో తన బ్రతుకు కొనముట్టుతుంది... ఆ తరువాత పాపం మల్లి....!

అతికష్టం మీద ముసలవ్వ "అయ్యా!" అని ఏదో అనబోయింది.

కాని మళ్లీ ఆమె మూతి మూయబడింది. ఆమె క్షణంలో తనకు తెలిసిన దేవుళ్లందరిని స్మరించింది... మల్లమ్మకోసం...

ఇంతలో ఆ వ్యక్తి గుసగుస వినబడింది ముసలవ్వ చెవిలో... "చప్పుడు చేయకు. నేను దొంగను కాను. రజాకార్ను కాను. పోలీసును కాను. మిమ్మల్నేమీ అనను, లొల్లిమాత్రం చేయకండి...".

అబ్బా! ఏమిటక్కరి! నమ్మించి గొంతుకోయడానికి చూస్తున్నట్టున్నాడు! తీయని మాటలతోనే సంతోష పెట్టి పాపం మల్లిని...!

అబ్బ! ఎంతకైనా తగుతారీ రాక్షసులు! ఔను. ముందుగా తీయని మాటలు – అవి సాగకపోతే అన్యోపాయాలు. అదేకదా క్రమం!...

ఎందుకైనా మంచిదని ముసలవ్వ వెంటనే ఆ వ్యక్తి రెండు కాళ్ళు దొరికించుకుంది... ఎంతో దీనంగా వేడుకుంది... "నీ బాంచెను! చెప్పులు మొత్త. నా తలకాయైనా తీసుకో. పోర్ని మాత్తరం ముట్టకు. అది నీ చెల్లెలనుకో.... నీ కాల్లు మొక్కుత!"

"లేదవ్వా! నమ్మవేం చెప్తుతుంటే? నేను దుష్మణ్ణి కాదు. నేనూ మీ అందరి వంటి తెలుగోణ్ణే!

శుద్ధ తెలుగులో మాట్లాడుతున్నాడు. ముసలవ్వ ఇదివరలో ఏ తురకవాణ్ని ఇంత

## ప్రగతి

ఆనాడు
ఒకే ఒక
కావ్యంలోనే
రెండు ఇతిహాసాలను
ఆవిష్కరించారు
మన మహాకవులు

ఈనాడు
ఒకే ఒక
వాక్యంలోనే
రెండు అర్థాలను
ఆవిష్కరిస్తున్నారు
మన సినీకవులు!!

– తాజీ ప్రసాద్

చక్కగా మాట్లాడగా వినలేదు. 'తౌశ్యతౌశ్య'గా మాట్లాడే నైజాం తురకలనే చూచిందామె. కాబట్టి ఈ వ్యక్తి తురక కాడేమోనని తర్కించుకుంది.

కొన్ని నిమిషాల పాటైనా చావు, మానభంగం తప్పినవి! ముసలవ్వ కదే ఇంద్రజాల మనిపించింది! మానవ హృదయంలో నిహితమై యుండే అజేయ ఆశావాదశక్తి ఆమెకు చేయూత నిచ్చింది. వచ్చిన వ్యక్తి ఎంత అపరిచితుడైనా, అతడు వచ్చిన పరిస్థితులెంత అనుమానాస్పదమైనవైనా, ముసలవ్వకు మాత్రం అతణ్ణి విశ్వసించాలనిపించింది. అది విశ్వాసం కాదు; విశ్వాసేచ్ఛ. విపద్దశలో గోచరించిన ఏకైక తరణాధారం. దాన్నెలా జారవిడుస్తుంది?

వచ్చిన వ్యక్తి కాళ్లు పట్టుకున్న ముసలవ్వ మెల్లమెల్లగా లేస్తూ అతని మోకాళ్లు, నడుము, వక్షస్థలం, వీపు ముఖం, తడమసాగింది. ఒకే ఒక చడ్డీ ఉంది. చొక్కాలేదు. దేహమంతటా పల్లేరుకాయలు, చిగురంత, జిట్ట, రేగు, ముండ్లు అంటుకొని ఎండిపోయిన రేగటిమన్ను, ఆ మంటిలో చిక్కుకొనియున్న తుంగపోచలు, గడ్డిపోచలు, వెంపలాకులు, తాటిపీచు వగైరా – ఇవన్నీ ముసలమ్మ చేతులకు కండ్లున్నవా అన్నట్టు గోచరించినవి. ఆపాదమస్తకం ఎన్నో చోట్ల శరీరం కొట్టుకుపోయినట్టు చర్మమే చెబుతున్నది. కొన్నిచోట్ల గాయాల నుండి స్రవిస్తున్న రక్తపు తడి ముసలవ్వ చేతికంటింది. మరికొన్ని చోట్ల గాయాల నుండి ఎప్పుడో స్రవించి ఎండిపోయి అట్టుకట్టిన రక్తపు ఆనవాళ్లు తగులుతున్నవి. శరీరమంతా జ్వరంతో రొట్టె పెంకవలె మసిలి పోతున్నది. ముఖం మీద ముచ్చెమటలు క్రమ్మినవి. శ్వాస అతికష్టం మీద నడుస్తున్నట్టున్నది. మధ్యమధ్య ఆపినా ఆగని మూల్గులు బయట పడుతున్నవి. గుండె వేగం విపరీతమై పోతున్నది.

స్పర్శతోనే ఈ స్థితినంతా గమనించింది ముసలవ్వ. ఆ వ్యక్తి నిస్సహాయుడు. అపాయ స్థితిలో హఠాత్తుగా తటస్థించిన శరణాగతుడు.

ఇంత తెలుసుకోగానే ముసలవ్వ మనస్థితిలో కాయాకల్పమైంది. అనిర్వచనీయమైన భావపరివర్తనం కలిగింది. ఐదు నిమిషాలకు పూర్వం మనుమరాలి శీలరక్షణ కోసం ఆగంతుకుని కాళ్లు పట్టుకొని "బాంచెను, కాళ్లు మొక్కుత" అని వేడుకున్న ముసలవ్వ ఇప్పుడు ఆశ్చర్య సహానుభూతుల సమ్మిశ్రిత స్వరంతో, "ఇదేం గతిరా నీది? గిట్లెందుకైనవు కొడుకా?" అని ప్రశ్నించింది.

"ఏదో అవ్వా! అదొక కథ... కొంతసేపు నన్నిక్కడ దాచు. తరువాత నాదారిన నేనె పోతాలే...'' అని అతికష్టం మీద అన్నాడాగంతకుడు.

"ఆ! మాపోతా మాపోతా.... ఒక్కటే పోకడ! చక్కంగ స్వర్గమే పోతా.... మాంచి బుద్ధమంతుడా పా!... హు పోతడట యాడికో!"

ఆగంతకుడు మాటాడలేదు. ముసలవ్వ వెంటనే మనమరాల్ని పిలిచింది, "మల్లీ! ఓ మల్లిముండా! దీవం ముట్టియ్యే జెప్పన; నిరుదొచ్చినాదే పోరీ?"

దీపం మాట వినగానే ఆగంతకుడు ఉలికిపడి అన్నాడు, "అబ్బో! వద్దవ్వా వద్దు... దీపం వెలిగించకు నీ పుణ్యం... పోలీసులు నా వెంట పడ్డారు. పట్టుకుంటారు..."

"ఇగ చాల్లే మాట్లాడకు! పోలీసులకన్న ముందల సావు దేవతే పట్టుకునే టట్టున్నది నిన్ను!" అని ముసలవ్వ గద్దించింది.

మల్లమ్మ దీపం వెలిగించింది. ముసలవ్వ ఒక మూలకొక గొంగడి పరిచింది. దీపపు వెలుతురులో ఆగంతకుణ్ణి కొంత తడవు పరీక్షించింది. బక్క పలుచని యువకుడు. పదునెనిమిదేండ్లకు మించని వయసు. నూనూగు మీసాలు – గంభీరతను సూచించే కండ్లు. సుకుమారమైనప్పటికీ చాపగీత బెత్తం వలె వంగగల దేహం. సౌమ్య సౌజన్యాలనీనే ముఖమండలం...

ఆ యువకుణ్ణి చూచిందో లేదో ముసలవ్వ ఆశ్చర్యం మేరమీరింది.

"రాజోలిగె ఉన్నవు కొడుకా! నీకెందుకొచ్చెరా ఈ కట్టం?... పండు పండు.. ఆ గొంగడ్ల పండు. బీరిపోతావేందిరా? పండు. ఆ! గట్ల! మల్లి పోరీ! కుంపటి మీద కడుముంతెడు నీళ్లెక్కియ్యే... అబ్బ! మంజరగున్నోలిగె కదుల్తది మబ్బు ముండ! ఈడ పోరని పానం పోతాందంటే దీనికి నిర్దమబ్బే

వదల్లేదు! ఊ! కానీ జెప్పన. ఎక్కిచ్చినవా కదుముంత? ఆ! ఇగరా... దీపం పోరని దగ్గరకు తే... దీపానికి ఇంటి తలుపుకు నడుమ నా గడంచె నిలబెట్టు. దానికి నా గొంగడి ముసుగెయ్యి... ఏసినావా? ఆ గట్ల. గిప్పుడు కొద్దిగ వుశారయింది పొల్లా! మొగడు నాలుగు మల్కల పెయ్యి మెదుగ బెడితే ఇంకా కుదుర్తది చురుకు!... కొద్దిగ సందుంచి ఓ కంచుడు బోర్లయి దీపంతెమీద. ఆ పోరనిమీద ఎలుగు పడాలె. కదుమదిక్కల్ల చీకటే ఉండాలె. గట్లకావాలె ఉపాయం... ఆ! గంతే! ఉన్నదే ఒనరు నీ దగ్గెర! మాచేత్తవులే సంసారం.... ఇగ కూకో వానిపక్కన. ముండ్లు తీసేయి ఉల్లుల్లుగ... అయ్యో! సిగ్గయితాందా వాన్ని ముట్టుకుంటె? ఏం మానావతివి గదనే! నీ సిగ్గు అగ్గిలబడ్డ! వాని పానం దీత్తవా యేం సిగ్గుసిగ్గనుకుంట? ఊ చెయ్యి చెప్పినపని. పాపం పీనుగోలె పడున్నడు గాదె! వాన్ని జూత్తె జాలిపుడుతలేదె నీకు దొమ్మరముండా? ఆ! గట్ల! నొప్పిచ్చుకు పాపం!..."

మహా ప్రవాహం వలె సాగిపోతున్నది ముసలవ్వ గొణుగుధోరణి. అందులోనే చీవాట్లు. అందులోనే వినోదం. అందులోనే ఆజ్ఞలు - ముసలవ్వ ఆజ్ఞలన్నీ చకచకా అమలౌతున్నవి.

> ## ఇంద్రధనుస్సు
>
> **కో**టానుకోట్ల<br>
> యోజనాల దూరంలో ఉండి<br>
> యుగయుగాల<br>
> విరహాగ్నితో మండి<br>
> వానచినుకులే అక్షరాలుగా<br>
> పృథ్వీప్రేయసికి<br>
> వ్రాసిన ప్రేమలేఖ చివర<br>
> సూర్యుడి సంతకం
>
> **'భగవద్గీత'**
>
> **నే**చెప్పింది చేసెయ్!<br>
> నామీదకి తోసెయ్!!<br>
> మిగతావన్నీ తీసెయ్!!!
>
> **– దుగ్గిరాల రామమోహనరావు**

యువకుడు నిజంగా అర్ధశుద్ధావస్థలో పడియున్నాడు. మల్లమ్మ జిట్ట రేగు ముండ్లు ఒక్కొక్కటి తీస్తున్నది. యువకుని కేదో క్రొత్త లోకంలోకి వచ్చిపడ్డట్లుంది.

ముసలవ్వ మళ్లీ ప్రారంభించింది.

"వచ్చినాయె ముండ్లన్ని! మాకట్ట పడుతాన్నవే పొల్లా! వున్నె ముంటుంది నీకు. మల్ల పెతరమాసకు తుంటకొక్కంత బుడ్డోన్ని కంటవులే! సరె. ఇగబటు... నీల్లెచ్చబడ్డాయి. ఈ పేగు నీల్లల్ల ముంచి వాని గాయాలన్ని కాపు. ఆరౌతం మరుకలు, మంటిముద్దలు తుడిపిపారెయ్యి. తానం జేసినట్టు కావాలె - పాపం! ఎంత సుకాళిపెయ్యే పొల్లంది! ముట్టుకుంటె దూదోలిగె తలుగుతాంది! ఎసొంటోని కెసొంటి గతొచ్చిందే!"

చూస్తూ చూస్తూ మల్లమ్మ పరిచర్య వల్ల యువకుని గాయాల బాధ తక్కువయింది. దేహమంత శుభ్రమైంది. మెల్లమెల్లగా తేరుకున్నాడు.

ఇంతలో ముసలవ్వ తలెలో ఏదో తెచ్చింది. యువకుని తలాపున కూర్చొని అతని తల నిమురుతూ గొణుగసాగింది.

"ఇగలే కొడుకా కొద్దిగ. గింత గటుక చిక్కటి సల్లల పిసుక్కచ్చిన... గింత కడుపుల పడేసుకో. ఎన్నడన్న తాగినావు తాతా గట్క? వరిబువ్వ తినెటోనికి నీకెమెరుక? గొల్లరామిగట్కంటే ఏమనుకున్నౌ? పొయ్యే పానం మర్లుతది! చూడు మరి కులం జెడిపోతవని బయపడుతాన్నవా? నువ్వు బామనోడవైనా, జంగమోడవైనా, యే కులమోడవైనా సరే - మొదలు పానం దక్కించుకో. అంతకైతె నాలికె మీద బంగారి పుల్లతోటి సరుకు పెడితే పోయినకులం మల్లత్తదట కాదు? ఆ! ఇగ తాగిపారెయ్యి గటగట!".

యువకుడు లేచి కూర్చున్నాడు. ముసలవ్వ మాటలకు కొద్దిగ నవ్వు వచ్చిందతనికి. చిరునవ్వు ముఖంతో ముసలవ్వను చూస్తూ తలె అందుకున్నాడు. అందులోది నవజీవన సర్వస్వసారమన్నట్లు ప్రీతితో గటగట త్రాగాడు - ముసలవ్వ మాట అక్షరాలా సత్యమైంది. సగం పోయిన ప్రాణాలు తిరిగి వచ్చాయి. యువకుని

ముఖం మెల్లమెల్లగా వికసించింది. కండ్లలో జీవనజ్యోతి వెలుగజొచ్చింది.

ముసలవ్వకు పూర్ణ సమాధానమైంది. యువకుని వైపు చూస్తూ ముడతలు పడ్డ ముఖంతో నవ్వుతుంటే ముడతలన్ని అంతర్ధానమైనవా అనిపించింది. కొన్ని నిమిషాల పాటలాగే ఉండిపోయారు ముగ్గురు...

యువకుని దేహాన్ని ప్రేమతో నిమురుతున్న ముసలవ్వ చేయి హఠాత్తుగా అతని చడ్డీ జేబువద్ద ఆగిపోయింది. వెంటనే "గిదేందిరో?" అంటూ ముసలవ్వ ఆ జేబులో చేయివేసి ఒక ఉక్కు వస్తువ తీసింది.

"అది రివాల్వరవ్వా! తోటాలతుపాకి!" అన్నాడు యువకుడు.

"ఎందుక్కొడుకో తుపాకీ? మమ్మల గిట్ల చంపుదామనుకున్నావా యెంది? అన్నది ముసలవ్వ.

"లేదన్నా! మిమ్మల్ని చంపేవాళ్లను చంపే అందుకది... ఈ రాత్రి ఇద్దరు పోలీసులను హతమార్చాను. మొన్న మీగ్రామంలోని నలుగురు నిర్దోషుల్ని కాల్చి చంపిన పోలీసులే...""

ముసలవ్వ ముఖ లక్షణాలు వర్ణనాతీతంగా మార్పు చెందినవి. మొదట కొద్దిగా భయం, ఆ తదుపరి తెగువ, ఆ తరువాత ఉత్సాహం, ఆ వెనుక విజయోల్లాసం క్రమశః గోచరించినవి.

యువకుడు ముసలవ్వ ముఖాన్ని సూక్ష్మంగా పరీక్షిస్తున్నాడు. భావ పరివర్తన చూచిన కొద్దీ అతని మానసం పరిపరివిధాల తర్కించుకుంటున్నది. ఆ విషయం ఎందుకు చెప్పానా అన్న పశ్చాత్తాప రేఖ కూడా అతని మనస్సును ఒకసారి స్పృశించిపోయింది. ఏమంటుందో ఈ వృద్ధురాలు? శతాబ్దాల దాస్య మనుభవించి దలితమైన ఈ అమాయక గ్రామీణ సమాజంలో తేజమెక్కడ శేషించింది? ఎలాగైనా ఆ గుడిసె ఆశ్రయం నుండి తన కుద్వాసన జరిగి తీరుతుందని అతనికి తోచింది. ఇద్దరు పోలీసులను చంపిన హంతకుణ్ణి ఎవరుండనిస్తారు? ఎంత మంది తనతోటి కార్యకర్తలు, ఈ గ్రామస్తుల పిరికితనం వల్ల పట్టు పడలేదు? యువకుని మనస్సు ఎన్నెన్నో వితర్కాలకు లోనౌతున్నది.

కొంతసేపు యోచించి ముసలవ్వ పెదవులు కదల్చింది. యువకుని హృదయం ధడుక్కుమన్నది.

"ఇద్దర్నా?.... కాని ఇంకిద్దరు మిగిలిన్రు కొడుకా! సగం పనే చేసినవు...!"

యువకుడు చకితుడైనాడు. అతని సుసంస్కృత మానసం గర్వోన్మత్తమై కల్పనా కాశంలో భ్రమణం సాగించింది. అతని తారుణ్యానురూప భావుకత్వం అతణ్ణి మైమరపించింది. శ్రీరామస్మరణ వల్ల ఉప్పొంగే హనుమంతుని దేహం వలె తన దేహం కూడా ఉప్పొంగినట్లనిపించింది. రివాల్వరు కొరకై చేయిచాస్తూ "తక్కిన వాళ్లను కూడా చూచుకొస్తాతే అవ్వా!" అనేశాడు. ముసలవ్వ రివాల్వరు లాక్కొని ప్రారంభించింది.

"చాల్లే చేశినకాడికి! బాద్దురుగాడవుపా! బాగ తిని ఉండబుద్ధిగాక పోలీసోల్లతోటే వైరం పెట్టుకుంటడట ఉచ్చిలి పోరడు! ఎందుకురా నీకు పోలీసోల్లతోటి కెలాట్కం?"

యువకుడన్నాడు. "నేను స్టేట్ కాంగ్రెస్ వాలంటియరు. నైజాం రాజుతోటి కాంగ్రెస్ పోరాడుతున్నది. ప్రజలు పోరాడుతున్నారు".

యువకుడేదో రాజకీయ సిద్ధాంత బోధ ప్రారంభిస్తాడా అనిపించింది. కాని మధ్యలోనే ముసలవ్వ అందుకున్నది. "యాడున్నదిరా నీ కొట్లాట? ఈడనైతే పెద్ద పెద్దోల్లంత తురక పోలీస్లోనే ఇండ్లల్ల పండబెట్లు కుంటానుగాదు? ప్యాదోల్లు కొట్లాడితే ఏమైద్దిరా?".

"పేదవాళ్లతోనే నడుస్తున్న దవ్వా కాంగ్రెస్ పోరాటం." అన్నాడు యువకుడు.

"మరైతే నీది కాంగిరిజో గీంగిరిజో అండ్ల ఈడుపడ్డోల్లు లేరార? గడ్డాలు మీసాలు నరిశినోల్లంత యాడ విరగడైపోయిన్రు?"

"వాళ్ళందరు పట్నంలో ఉంటారు. రాజుతో మాట్లాడుతారు. ప్రజల తరుపున వాదిస్తారు. అధికారాలు ఇప్పిస్తారు. నాయకత్వం చేస్తారు".

ముసలవ్వ విసుగుతో అందుకుంది. "ఏహే! గదెంత నాకు మనసు పట్టది – పెద్ద పెద్దోల్లేమొ ముచ్చట్లు పెట్టుకుంట కూకుంటరట! – పసి పోరగాల్లనేమొ పోలీసోల్ల మీదికి పొమ్మంటరంట?

ఇగ యీ పొల్లగాల్లేమొ చేసుకున్న పొల్లల ముండ మోపుటానికి తుపాకులు బుజానేసుకొని బైలెల్లుతరట! ఎంత పాడుదిన మొచ్చింది! అన్యాలం పాడుబడ!"

అలాగే కొంత సేపు గొణిగి ముసలవ్వ ఆజ్ఞాపించింది. "అరేయ్! ఇగ కొద్దిగ కన్ను మలుపుకో. జాము నాత్తిరున్నదింక. ఇంత నిద్రపట్టితే బతుకుతవు - వశేయ మల్లిపోరీ! మనిద్దరం తెల్లారేదాక కావలుండాలే. నువ్వా కొసకు. నేనీ కొసకు. కూర్పాట్లు పడ్డవంటే యాదుంచుకో - ఒక్క చరుపుకు దయ్యం వదిలిపోవాలె మరీ - ఆ!"

OOOOOOO

పాలు పిండేవేళ అతిక్రమించి పోతున్నది. ఇండ్ల వెలుపల కట్టి వేసియున్న గేదెలు లోపలి దుడ్డెల కొరకు అరుస్తున్నవి. లోపలి నుండి దుడ్డెలు విలపిస్తున్నవి. పాల చేపుల ఆతురత ఒక వైపు; ఆకలి బాధ రెండవ వైపు. కాని పాలు పిండ బడడం లేదు. రోజూ ఈపాటికి ఎటు విన్నా "జుంయిజుంయి" మనే వయస్సంగీతం నేడు సంపూర్ణంగా నిలిచిపోయింది. భయం వల్ల గ్రామంలోని జీవన లక్షణాలన్ని ఒక్కుమ్మడి లుప్తప్రాయమైపోయినవి. మృత్యు సమయపు అంతిమ సంచలనమైనా లేదు.

స్మశాన వాటికలోని కాటి చిటచిటలైనా లేవు. ఆ గ్రామంలో అనాదికాలం నుండి అంతా నిశ్శబ్దమే అన్నట్టనిపించింది.

రామమ్మ, మల్లమ్మ - ఇద్దరు కావలి కాస్తున్నారు. యువకుడు సుఖ నిద్ర పోతున్నాడు. చీమ చిటుక్కుమన్నా అదిరిపడే అంత నిదానంగా ఉన్నారు గ్రామ ప్రజలు. కానీ చీమకూడా చిటుక్కుమనడం లేదు. గత రాత్రి భయంకర సంఘటనకు కారకుడైన ఆ యువకుడొక్కడే నిద్రిస్తున్నాడు. తక్కిన గ్రామమంతా శ్వాస బిగబట్టి నిరీక్షిస్తున్నది.

దేనికో? ఎవరికొరకో? ఎందుకో? అదంతా అందరికి తెలుసు పాత కథే!...

రామమ్మ యోచిస్తున్నది. ఎవరో కాంగ్రెస్ వారు ఊరికి వచ్చారన్న నేరంపైన ఇదివరకే నలుగురు నిర్దోషులు కాల్చివేయబడ్డారు. ఇక ఈసారో, ప్రత్యక్షంగా ఇద్దరు పోలీసులే చంపబడ్డారు. ఠానా భగ్నం చేయబడింది. ఊరినంతా దగ్ధం చేసి ఊరివారందరిని కాల్చివేసినా ఆశ్చర్యం లేదు. అదొక పండుగే! ఏ ఒక్క ఇంట్లోనో పోలీసులు చొచ్చి హత్యలు, మానభంగాలు సాగించడం, ప్రక్క ఇంటి వారు కిమ్మనలేక పోవడం, ఈ విధంగా ఒక్కొక్క యింటిలెక్కన తుద కందరి కదేగతి పట్టడం - ఇంతకన్నా ఊరి వారందరు ఒకేసారి చంపివేయబడడం మేలుకాదా? పదిమందితో చచ్చినా మంచిదే, బ్రతికినా మంచిదే కుక్కచావుకన్న!

నిద్రిస్తున్న యువకునికి తల నిమురుతూ రామమ్మ గొణిగింది. "అబ్బ! ఏం పోరడు! ఇసొంటోల్లెంత మంది చావాల్నో ఇంక!"

## స్పందన

ఒక మహత్తర శిల్పాన్ని-
వీక్షించినప్పుడు అచ్చెరువొందాను
ఒక మహత్తర చిత్రాన్ని-
విశిష్టంగా పరిశీలించినప్పుడు-
గొప్ప అనుభూతిని పొందగలిగాను.
మృదుమధురమైన సంగీతాన్ని విన్నప్పుడు-
తన్మయత్వంతో ఆనందించాను.
అపురూపమైన కాలియందెల రవళి
విన్నప్పుడు-
నాట్యకళానైపుణ్యానికి ముగ్ధుణ్ణయ్యాను.
కానీ-
ఒక కావ్యాన్ని చదివినప్పుడు-
అచ్చెరువొందలేదు.
అనుభూతి పొందలేదు.
తన్మయత్వంతో ఆనందించలేదు
ముగ్ధుణ్ణి కాలేదు.
అయితే-
మరొక కావ్యరచన కుపక్రమించాను
కారణం-
నా మనసు స్పందించింది.

**-డా॥ ధూర్జటి వేంకట బాలాజి**

అకస్మాత్తుగా బజారులో మోటార్ ట్రక్కు చప్పుడైంది. ఎటూ విన్నా బూటు కాళ్ల తటతటలే వినరాసాగినవి. ఏవో అరుపులు, తురకబాషలో తిట్లు – దుర్భాషలు – ప్రగల్భాలు. చటేల్ ఛటేల్‌మని మధ్య మధ్య కొరడా దెబ్బలు.

"చస్తి! చస్తి! నీబాంచెను... నాకెరుకలేదు... అయ్యో! వాయ్యో!! వావ్వో!! అన్న అరపులు.

మిన్నుముట్టే ఆక్రోశాలు.. అంతకు మించిన క్రూర నినాదాలు. ఒండొంటితో పోటీ చేస్తున్నవి. మనుష్యులు ఉన్న వారున్నట్టు బజార్లలో ఈడ్వబడుతున్నారు. రెండు గడియల క్రితం శ్మశాన వాటికను మరపించిన గ్రామం ఇప్పుడు యమపురిని తలదన్నుతున్నది.

మల్లమ్మ గడగడలాడసాగింది. యువకుడు దిగ్గున లేచి కూర్చున్నాడు. ఆ గాఢ నిద్ర క్షణంలో మటుమాయమై పోయింది. రివాల్వరు ముసలవ్వ చేతి నుండి తీసుకొని తోటాలెక్కించాడు. బయట జరుగుతున్న అలజడి రెండు నిమిషాల వరకు విన్నాడే లేదో – అతన్నొక మహావేశం ఆవరించింది.

ముసలవ్వ స్థితిమాత్రం చెప్పే లేదు. అది భయం కాదు; వ్యాకులత కాదు; దుఃఖం అసలే కాదు. అపూర్వమైన నిశ్చలత్వం, గాంభీర్యం ఆమెలో ప్రవేశించినవి. బయటి హాహాకారం చెవిసోకిన కొద్దీ ఆమెలో కూడా అదొరకపు ఉద్వేగం బయలుదేర సాగింది.

రివాల్వరుతో తోటాలు నింపుకొని యువకుడు దిగ్గున లేచాడు. తలుపు వద్దకి చకచకా నడిచాడు – గొళ్లెం మీద చేయి పెట్టాడు. తీయబోయాడు – కాని – కాని వెంటనే తనిచేయి మీద మరొక చేయి వచ్చి పడింది. అది ఉక్కు చేయి కాదుగదా అన్నంత దృఢతరంగా తగిలిందతని చేతికి – అతడు మహాశ్చర్యంతో వెనుకకు తిరిగి చూచాడు. "ఆ?" అన్నాడు.

ముసలవ్వదే ఆ ఉక్కు చేయి!

"యాడికి" అని ప్రశ్నించింది ముసలవ్వ.

యువకుని మాట తడబడ్డది. తుపాకి గుండ్ల మధ్య విహరించే ఆ వీర యువకుడు, రాక్షసులనైనా నిర్భయుడై ఎదిరించే ఆశూర శిరోమణి, దేశ కల్యాణానికై ప్రళయాన్నైనా ధిక్కరించే తరుణ సింహం –నేడొక్క దెబ్బ యేళ్ల ముసలవ్వ ప్రశ్నకు జంకాడు. అతని గుండె జల్లుమన్నది – కాని వెంటనే గొంతు సవరించుకొని అన్నాడు. "ఎక్కడికేమిటవ్వా? అటో ఇటో తేలిపోవాలి. నిర్దోషుల హింస జరుగుతుంటే చేసిన వాణ్ణి నేను దాగుకోవాలా? దాగడం మాత్రమెంత సేపు? ఈ యిల్లు సోదా తప్పుతుందా? – పైగా నావల్ల మీకు అపాయం కలుగుతుంది – నన్ను పోనీ అవ్వా!"

ముసలవ్వ మాట్లాడ లేదు – యువకుని చేయిపట్టి వెనకకు లాగింది. మంత్ర ముగ్ధునివలె అతడామెను అనుసరించాడు.

బయట అలజడి అధికమైంది. బూటు కాళ్ల చప్పుడు గుడిసెను సమీపిస్తున్నది. ముగ్గురు నలుగురు వ్యక్తులు గుడిసె ముందు నుండి పక్క ఇంటి ముందటికి వెళ్లారు – ఆ వెనక –

"రామాథన్‌గర్నీకీ గుడీస్ యహీహై" అన్న మాటలు వినిపించినవి.

మళ్లీ ఒకసారి యువకుడు బయటి తలుపు వైపు పోబోయాడు. కాని ముసలవ్వ అతన్ని వెనక్కి నెట్టింది. రివాల్వరు అతని చేతి నుండి లాగుతుంది. మినుకు మినుకు మంటున్న దీపాన్ని పూర్తిగా ఆర్పింది. మల్లమ్మను పిలిచి చెప్పింది.

''పొల్లా! నిన్న మఁరి కొంచడు కుట్టటానికియ్యలే! ఆ దుప్పటీన్ను కండువ తీస్కరా? యాడబెట్టినవో, తే ఎల్లం – తెచ్చినవా? ఆ! పిల్లగా! ఆ దుప్పటి కట్టుకో, కండువ నెత్తికి చుట్టుకో – ఊ యేమాయె? గింతసేపా? మల్లీ నీ రెండు చేతులు దండకడ్యాలు వానికియ్యి.... బక్క పల్చటోడు పట్టుతై... ఆ!పట్టినయా? గంతే? ఒక్క కుర్మదారముంటె బాగుండు. ఇప్పుడేడ దొరుకుద్ది... ఊ! లేకుంటె లేకపాయె – ఈ పోరని చడ్డి కూరాటికుండ కింద దాచి పెట్టేపొల్లా! ఆ! గొల్లేశ మెసినవా కొడుకా? అచ్చం ఎర్రగొల్లోనోలిగనే ఉంటవు! ఎవడన్న మాట్లాడిత్తే గొల్లోనోలె మంచిగ మాట్లాడాలి..."

"ఆ" అన్నాడు యువకుడు.

దాగి తిరిగే కార్యకర్తలకు గొల్లవేషాలు

మామూలే కనుక యువకుడు సంసిద్ధుడైనాడు. వేషం తయారయింది. ఇక ఏ త్రోవనో బయట పడడం మాత్రమే శేషించింది. ముసలవ్వ ఆజ్ఞకై నిరీక్షిస్తున్నాడు.

అకస్మాత్తుగా తలుపు మీద నాలుగైదుసార్లు దిబదిబమని దెబ్బలు పడ్డవి. "రామీ! ఓరామీ! ఓ గొల్ల రామీ! తల్పూకీ ఖోల్" అనే కర్కశ స్వరాలు వినిపించినవి. కొందరు బూట్లవాళ్లు ఇంటి దగ్గర దగ్గరగా నిలుచుంటున్న అలికిడి వినవచ్చింది. ఇంకేముంది? తప్పించుకునే వీలులేదు. ఈ గొల్లవేషమంత వ్యర్థమైనట్లే! యువకుని చేయి రివాల్వరుకై వెదకసాగింది. కాని ముసలవ్వను అడిగే ధైర్యం రాలేదు.

ముసలవ్వ గుసగుస ప్రారంభించింది. "మల్లీ! ఆ మూలకు మంచం వాల్చి గొంగడేయ్యే. పిల్లగా! అండ్ల పండుకో - ఊ పండుకో"

యువకుని తలుపు మీద దిబదిబ! "ఓ రామీ! తల్పూ తీసౌ లేదూ. తీ బిన్న హరాంజాదీ! మాట్లాడ్తొ! నీకీ తోడ్కల్ తీస్తం ఠైర్! ఫౌరన్‌తీ తల్పు! లేకుంటే తోడాయిస్తంసూడు"

ముసలవ్వ ఇప్పుడిప్పుడే నిద్ర లేచిన దానివలె ఆవలిస్తూ, ఒళ్లు విరిచిన చప్పుడు చేస్తూ అర్థస్పష్టంగా ప్రారంభించింది.

"ఎవ్వర్రా, పెద్ద దొంగనాత్తిరచ్చి తలుపు కొడ్తాన్రు? దొంగముండ కొడుకు లున్నట్టున్నరు?"

"మీ ఇల్లు పాడుబడ, పోలీసోల్లు రౌను గత్తుకత్తె మీ యీపులు పెట్న బలుగుతయ్..."

బయటి వాళ్లు "మేవ పోలీసోళ్లం..." అని ఇంకా ఏమేమో చెప్పబోయారు. కాని ముసలవ్వ ఒక్క అక్షరం కూడా వినిపించుకోలేదు. బిగ్గర బిగ్గరగా అరపు - మధ్యమధ్యన రెండు మాటల గుసగుస-

"కాలం పాడుగాను! ఎవ్వల కొంపల వాళ్ళను వడుండనీయరు. రాత్తిరనక వగలనక చంపుతాంటారు--

పొల్లా! పోరని మంచానికి నా గడంచె అడ్డం పెట్టు.

"నన్నేం దోసుకుంటర్రా? ముసలి ముండ దగ్గేరమున్నది? దొంగలైతే ఉన్నోన్ని దోచుకోండి - లేవలేందాన్నెందుకు చంపుకతింటరు? అబ్బబ్బ తలుపు పలగొట్టేగట్టే ఉన్నది. ఆగరాదుండి? కొట్టేత్త తప్పా గుర్రాన్ని, లేవలేని ముండను - చెంగు చెంగున గంతులెయ్యాల్నా మీ తొందరకు?

మల్లీ! మాట్లాడక ఆ పోరని పక్కల పండు ఊ! నడూ!

"ఇగ పలగొట్టంద్ర! లేచి తలుపు తీసేదాకా గూడా ఓపిక లేకపోతె పలగ్గొట్టుద్రని - ఇంట్లజొచ్చి నా దగ్గురున్న రావన భరాలు తలిన్ని దోసుకోర్రీ - దీపమున్న ముట్టిత్తామంటె కుంపట్ల అగ్గిలేదు. ఈ మల్లిముండకు ఎన్నిసార్లు చెప్పిన మాపటల్లా కుంపటి కప్పదు. ముదరట్టం ముండ! ఇగ నిన్న మొగడచ్చిండేమొ దాన్ని పట్టపగ్గాల్లేకుంటున్నది. ఏ పని చెప్పినా యినుపించుకోదు. నడుమనే ఆగమైతాంది మొగన్ని చూచి... మురిసిపోతాంది వగల ముండ!

చెయ్యేసి పండుకో పోరడా దానిమీద! చూసెటోని కనుమానం రావద్దు.

"ఇగ నాచాతగాదురా తండ్రీ! ఈ మల్లిముండ లేవలేదు. ఓ మల్లీ! ఓరి మల్లిగా! ఊహూ వీల్లు లేవరు నాకు దీప్పప్పంతె దొరుకదు చీకట్ల! వీల్ల వైస్సు వక్కలుగాను. బజార్ల గంత లొల్లయితాంటె మారాజుగ గుర్రం కొడతాన్రు.... ఈ అంగడపోర్నినేం జేతు? నా ముంగేట్నే కొడుకు కోడలు రుచ్చాలోలె పడిపోయిన్రు. ఈ పోరి నా నెత్తిన పడేశిన్రు. దెబ్బకొడ్తనేమొ రద్ది. కొట్టకుంటే బుద్ధిరాదు. ఎక్కడి పీడ తెచ్చి పెడితివిరా నా పానానికి! యాడున్నవురో కొడుకా! నా కొడుకా! ముసలి ముండకు చెరబెట్టి పోయినావు కొడుకా! నా కొడుకా! నేనేంజేతు కొడుకో! నా కొడుకా!"....

ముసలవ్వ మహార్భాటంతో రాగం పెట్టి ఏడవసాగింది. బయటి వాళ్లు నానా విధాల మాట్లాడుతున్నారు. పాపం పోనీ అని ఒకరు, అబ్బో ఈ ముసలిది చాల బద్మాష్ అని మరొకరు --మొత్తానికీ సోదా జరిగి తీరాలని అందరై నిశ్చయించారు.

లోపలి నుండి గొణుగు సాగుతూనే ఉంది. "అవ్వల్ల... అయ్యల్ల! ఆగున్రి తలుపు తీసేదాక --అవ్వల్ల! అయ్యల్ల!

"తోడ్‌దెవారే దర్వాజా!" అని బయట ఆజ్ఞ ఇవ్వబడుతుండగనే ముసలవ్వ తలుపు గొళ్లెం తీసింది. ఇద్దరు పోలీసులు ఒక్కుమ్మడి తలుపు నెట్టి తలుపు తెరువబడటంతోనే అమాంతం ఒకరి మీద ఒకరు పడ్డారు.

వాళ్లు పడడంతోనే ముసలమ్మ పెద్ద కేక వేసింది. వాళ్లు లేవడంతోనే వాళ్ల క్రిందనే పడ్డట్టు ఏడవ సాగింది.

"చంపితిర్రా! నీ దొడలు ఐడ - ముసల్దాని పానం తీత్తిర్రా! ఇగ చూసుకోండి. ఆ పడుచు పోరగాండ్లాడ మంచంలో పండున్నరు. ఈడ నేనున్న - కుండలున్నయి. పోరి గురుగులున్నయి. తలె ముంతలున్నయి. పోరి మెదల గంగెపుత్తె లున్నయి. పోరగానికి ఎండు దండ కడియాలున్నయి. - ఇగేం కావాల్లో తీసుకోండి. చంపాల్నంటే చంపుండి. నన్ను చంపుండి. పోరన్ని చంపుండి. పొల్ల ముండ మెయ్యక ముందు దాన్ని గూడ తుపాకి నెయ్యండి. ఇద్దర్నొక్కపారే చంపండి. అప్పట్నించి నన్ను చంపుక తింటార్రు. ఇగ జుర్రుకోండి ఏం జుర్రుకుంటరో!"

మల్లమ్మ మెల్లగా కండ్లు నులుముకుంటూ మంచం దిగి వ్యాకుల దృష్టితో అటూ ఇటూ చూడసాగింది. యువకుడు కూడ ఆవలిస్తూ లేచి మంచం మీదనే కూర్చున్నాడు. పోలీసు వారందరు ఒకరి ముఖం ఒకరు చూచుకోసాగారు. ముసలవ్వ ధోరణి నడుస్తనే ఉంది.

''ఇంకేంచేత్తరో చెయ్యరాదుండి.. తుపాకులున్నైగద...చంపరాదుండి నన్ను.. ఇగ బతికి నన్నొద్దులు బతుకుతనా?"

యువకునివైపు చూపిస్తూ పోలీసు జమాదారు ప్రశ్నించాడు. "వాడు యెవడున్నడ్ చెప్పు! కాంగ్రెసోడాయేం? ముసలవ్వ నెత్తిన నోరు పెట్టుకుని అరవ సాగింది.

"వాడెవ్వడా? ఎవ్వడు పడితే వాడు మా వక్కల్ల వండుటానికి వేమేం బోగ మొల్లమనుకున్నావా? నిన్నెవడన్న గట్లనే అడుగుతె ఎట్లుంటది? ఈ మాటల్తోటి మానం దీసుడెందుకు? పానం తియ్య రాదుండి! నా బుద్దెరిగిన కాన్నుంచి నేనైతే గింత బెజ్జతి మాట యెవ్వల్లనోట్నుంచి యినలే. ఈ ముసల్దానికి ఇయ్యాల మానం పోయింది. ఇగ యాన్నన్న ఉరిబెట్టుకుని చస్తేంది. ఇసొటి బతుకు బతికిందాని కన్న?.... వాడు మా మల్లడైతడా కాడా ఊరోల్లందర్ని తెలుసుకోర్రి. వెలుగచ్చినంక బాగ పరిచ్చపట్టి చూస్కోండి. కాని గిసొంటి బే కంగాలు కూతెలందుకు? మేమసంట్లోం కాదు బాంచెను! ఏదో మీ పాదాలకింద బతుకు తున్నాం -- బైటోడు గొల్ల రామి గుడిశెలకొచ్చి తప్పించుకుంటాడు? పానంతో పట్టుకచ్చి అప్పు చెప్పనయ్య? గొల్లరామెసొంటిదో ఊరోల్ల నడుగండి!"

అప్పటి తీవ్రతకు, ఇప్పటి విధేయతకు పోలీసులు చకితులైనారు. ఏమనుకోవాలో, ఏం చేయాలో వారికి తోచలేదు.

"పోర్రిబాంచెను! ఈడేం లేదు. నా మాట అబద్దమైతే తలకాయ కోశిత్త. నేనెడికి ఊరికిపోను. ఈడ్నే ఉంట. నా మాట డాకల చూడుంది. ఇగ తిప్పల బెట్టకుండి?"

పోలీసు జమాదారు కొంతసేపు యోచించి లేస్తూ అన్నాడు. "అచ్చా! నేన్ పంచనామా చేస్కోనీ వస్తా. నీ బయాన్కీ తీస్కుంటా. విన్కీ హాజర్ చెయ్యాలే. లేకుంటే నీకీ షూట్‌చేస్తా తెల్సిందీ?"

జమాదారు బయలుదేరాడు. ముసలవ్వ మంచం మీద కూర్చొంది. ఒక వైపు యువకుడు, మరొకవైపు మల్లమ్మ.... అదొక అపూర్వ సమ్మేళన మనిపించింది యువకునికి --

"అవ్వా! నీవు సామాన్యురాలవు గావు. సాక్షాత్ భారత మాతవే!'' అన్నాడు యువకుడు భావలీనతలో కండ్లు మూసి.

"దోడ్త్! కొంటె పోరడా! నాకే పేర్లబెడుతున్నావు?... నా పేరు గొల్లరామి! గంతే... ఇగ నువ్వెల్లు... మల్లిని అత్తోరింటికి తోలుకపోత... పొద్దెక్కుతాంది. ఊ! యెల్లు...." ముసలవ్వ ఆజ్ఞ అనుల్లంఘనీయమైందని యువకుడది వరకే తెలుసుకున్నాడు.

■